లింక్ ఓపెన్.. రూ.4.92 లక్షలు మాయం

మానకొండూర్ రూరల్, ఆగస్టు 23 : గుర్తు తెలియని వ్యక్తి పంపిన లింక్ ఓపెన్ చేసిన ఓ వ్యక్తి రూ.4.92 లక్షలు పోగొట్టుకుని మోసపోయాడు. మానకొండూర్ మండలం ఊటూర్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నెమ్మది ప్రశాంత్ మొబైల్‌లోని ఇన్‌స్టాగ్రామ్‌కు ఓ గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మోబైల్ లింకు పంపించాడు. ఆ లింక్‌ను ప్రశాంత్ ఓపెన్ చేయగా రూ.4.92 లక్షలు అతని ఖాతాలో నుంచి కట్ అయ్యాయి. దీంతో తాను మోసపోయినట్టు గమనించిన బాధితుడు మానకొండూర్ పోలీస్ స్టేసన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సదన్ కుమార్ తెలిపారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన లింకులను ఎవరూ ఓపెన్ చేయవద్దని సీఐ సూచించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్ రూరల్, ఆగస్టు 23: తిమ్మాపూర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనర్‌పై పురుషులకు ఈ నెల 30 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభమవుతున్నట్లు సంస్థ డైరెక్టర్ డీ సంపత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు చెందిన గ్రామీణ యువకులు దరఖాస్తు చేసుకోవాలని, శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు.

రేపు ఉమ్మడి జిల్లా సైక్లింగ్ ఎంపిక పోటీలు

కొత్తపల్లి, ఆగస్టు 23 : కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న ఉమ్మడి జిల్లా సైక్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు చైర్మన్ డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు బుర్ర మధుసూదన్‌రెడ్డి, సురభి వేణుగోపాల్ తెలిపారు. వెలిచాల బైపాస్ రోడ్డులో అండర్-14,16,18,23,23 సంవత్సరాల వైవిభాగంలో పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈఎంపిక పోటీల్లో ప్రతిభ చాటిన వారు సెప్టెంబర్ మొదటి వారంలో జనగామలో జరగబోయే రాష్ట్రస్థాయి రోడ్డు సైక్లింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు. వివరాలకు 9398230614 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు ఎల్ ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి, ఆగస్టు 23: బోయినపల్లి మండలం మాన్వాడలోని శ్రీ రాజరాజేశ్వర జలాశయం నుంచి శనివారం ఎల్ఎండీ ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయనున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఎస్సారార్‌లో 17.78టీఎంసీలు నిల్వ ఉన్నట్లు చెప్పారు. ప్రాజెక్టు గేట్ల ముందుభాగం, వాగు సమీపంలో విద్యుత్ మోటర్లు ఉంటే రైతులు తీసివేసి గడ్డపై పెట్టుకోవాలని అప్రమత్తం చేశారు. పోలీసులు,రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సమాచారం అందించారు. ఏక్షణమైనా మళ్లీ ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు రావచ్చని తెలిపారు.

చీటింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్

తిమ్మాపూర్, ఆగస్టు 23 : చీటింగ్ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు తెలిపారు. ఎల్ఎండీ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సెలవు వేతనాలలో జరిగిన అవకతవకలపై అప్పటి ప్రధానోపాధ్యాయుడు రాజభాను చంద్రప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించిన పోలీసులు.. పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన తిరుమల, మరో వ్యక్తి రాజ్ కుమార్‌ను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వారిని రిమాండ్ చేసినట్టు ఎస్ఐ వివరించారు.

దరఖాస్తుల స్వీకరణ నేటితో ముగింపు

కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 23 : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వెనుకబడిన తరగతుల నిరుద్యోగ యువతకు అందించే ఉపాధి నైపుణ్య శిక్షణ దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 24తో ముగుస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 25 ఏళ్ళలోపు వయసు, టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణులై ఉండి, కుటుంబ వార్షికాదాయం ఏడాదికి రూ.5 లక్షలకు మించకుండా ఉన్న అభ్యర్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వంద మంది అభ్యర్థులను ఎంపిక చేసి మూడు నెలల పాటు నాన్ రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.4 వేల చొప్పున స్టైఫండ్ అందించనున్నట్లు, శిక్షణ పూర్తైన తర్వాత ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎల్జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు అర్హులైన వారు www.tgbcstudycircle.cgg.gov.in లో శనివారం రాత్రి వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు 0878-2268686 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పారిశుధ్యాన్ని మరింత మెరుగు పరుచాలి

- వంద శాతం చెత్త సేకరణ చేపట్టాలి
- నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ కార్పొరేషన్, ఆగస్టు 23 : నగరంలో పారిశుధ్యాన్ని మరింత మెరుగు పరుచాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో పారిశుధ్య నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, కార్మికులు చేస్తున్న పారిశుధ్య పనులతో నగరం చాలా పరిశుభ్రంగా ఉందన్నారు. దాన్ని మరింత మెరుగు పరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పారిశుధ్య కార్మికులతో పాటు ఎస్సైలు, జవాన్లు ఉదయం 5గంటలకే క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. ముందుగా డివిజన్ వారీగా ఎలాంటి సమస్యలు ఉన్నాయో ప్రతి రోజు గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. పెద్ద సమస్యలు ఉన్నట్లయితే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పారిశుధ్యానికి సంబంధించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, పరిష్కారం చూపాలని ఆదేశించారు. అదనపు కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లు కూడా ప్రతి రోజు శానిటేషన్ పనులను పర్యవేక్షణ చేయాలన్నారు. నగరపాలక సంస్థలో పారిశుధ్యం ప్రధానమైనదని, నగరం పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉండడంతో పాటు వారి నుంచి ఫిర్యాదులు తగ్గుతాయని తెలిపారు. ఆ దిశగా ఎస్సైలు, జవాన్లు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు ఇంటింటికీ వెళ్లి వంద శాతం చెత్తను సేకరించేలా చూడాలని ఆదేశించారు. అట్ట ముక్కలు, ప్లాస్టిక్ డబ్బాలను డీఆర్‌సీసీకి తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చికెన్ వేస్టేజ్ డ్రైనేజీల్లో వేయకుండా చూడాలని, చికెన్ వ్యర్థాలను తరలించే బాధ్యతను ఏజెన్సీకి అప్పగించామని, దీనిపై ఎస్సైలు, జవాన్లు పర్యవేక్షణ చేయాలన్నారు. చికెన్ వ్యర్థాల తరలింపు కోసం ప్రత్యేక టెండర్ పిలవడం మంచి పరిణామమన్నారు. కార్మికులకు అందించే చీపుర్లు, తట్టలు, పారల కోసం టెండర్లు పిలిచామని, త్వరలోనే కార్మికులకు వాటిని అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపారులందరూ ట్రేడ్ లైసెన్స్ పొందేలా చూడాలని, పన్నుల వసూలుపైనా దృష్టి సారించాలని సూచించారు, నగరంలో ప్లాస్టిక్ నివారణ చర్యల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే షాపుల్లో తనిఖీలు చేయాలని ఆదేశించారు. నగరంలో పూర్తిగా చెడిపోయిన డంపర్లను మార్చాలని, కొత్త వాటికోసం టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. నగరంలో డంపర్ బిన్ పాయింట్ల వద్ద కూడా తగిన శుభ్రతను పాటించాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సువార్త, అసిస్టెంట్ కమిషనర్ వేణు మాధవ్, ఎస్సైలు, జవాన్లు పాల్గొన్నారు.

డ్రగ్స్ కట్టడికి చర్యలు

- పలుచోట్ల జాగిలంతో పోలీసుల తనిఖీలు

అలుగునూర్ చౌరస్తాలో జాగిలంతో తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిమ్మాపూర్, ఆగస్టు 23 : డ్రగ్స్ కట్టడికి పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని అల్గునూర్, ఎల్ఎండీకాలనీ, పలు ఇంజినీరింగ్ కళాశాలల సమీప దుకాణాలు, పాన్ షాపుల్లో నార్కోటిక్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగాలాలతో తిమ్మాపూర్ సీఐ స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ముమ్మరంగా తనిఖీలు చేశారు. నిషేధిత గంజాయిని అక్రమంగా రవాణా చేసే వ్యక్తులను పట్టుకునేందుకు ఇక నుంచి జాగిలాల సహాయం కూడా తీసుకోనున్నట్టు చెప్పారు. డ్రగ్స్ వల్ల యువకుల జీవితాలు నాశనం అవుతున్నాయని సీఐ తెలిపారు. ఎక్కడైనా డ్రగ్స్ విక్రయించినట్లు సమాచారం ఉంటే డయల్ 100కి కాల్ చేయాలని.. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. తనిఖీల్లో ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు, బ్లూకోల్ట్స్ సిబ్బంది సురేశ్, మల్లికార్జున్, సిబ్బంది మహమ్మద్ సలావుద్దీన్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంపై డీపీవో విచారణ

హనుమాన్ ఆలయాన్ని పరిశీలిస్తున్న డీపీవో రవీందర్, డీటీసీపీవో అంజయ్య

రామడుగు, ఆగస్టు 23 : మండలంలోని గోపాల్‌రావు పేటలో హనుమాన్ ఆలయ పునర్నిర్మాణంపై కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం డీపీవో రవీందర్, తదితర అధికారులు పోలీస్ పహారాలో విచారణ చేపట్టారు. స్థానిక గ్రామ పంచాయతీ సమీపంలోగల హనుమాన్ ఆలయం శిథిలావస్థకు చేరడంతో పునర్నిర్మాణానికి గ్రామంలోని అన్ని కులాల సంఘాల ఆధ్వర్యంలో జూన్ నెలలోనే తీర్మానించారు. అదే సమయంలో కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, ఆమె భర్త వెంకట్రాంరెడ్డి డీపీవోకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జూన్ 22న విచారణ చేపట్టిన డీఎల్‌పీవో నివేదిక ఆధారంగా ఆలయ నిర్మాణానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని జూలై 7న డీపీవో తెలపడంతో గ్రామ ప్రజలంతా కలిసి ఈ నెల 11న ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు. కాగా, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మరోసారి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిచిపోయాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం పోలీస్ పహారా మధ్య డీపీవో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు చేసిన ఫిర్యాదు ఏంటని డీపీవోను ప్రశ్నించడంతో ఆయన చదివి వినిపించారు. అనుమతి లేకుండా గుడి నిర్మాణం చేపట్టారని, దౌర్జన్యంగా పాత ఆలయాన్ని కూల్చారని, ఆలయం పునర్నిర్మిస్తే కీడు జరిగే అవకాశం ఉందని ఫిర్యాదు చేసినట్టుగా చెప్పడంతో గ్రామస్తులు గ్రామంలోని పలు ఆలయాలు నివాస గృహాల మధ్య ఉన్నాయని, హనుమాన్ ఆలయం సత్యప్రసన్న నివాసానికి 20 మీటర్ల దూరంలో ఉంటుందని తెలిపారు. ఇరువర్గాల అభిప్రాయాలను తీసుకున్న డీపీవో నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని, త్వరలోనే వెళ్లడిస్తామని చెప్పారు. ఇక్కడ డీటీసీపీవో అంజయ్య, సీఐ ప్రకాశ్‌గౌడ్, రామడుగు, చొప్పదండి మండలాల ఎస్ఐలు సురేందర్, అనూష, ఎంపీవో శ్రవణ్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాస్, గ్రామానికి చెందిన అన్ని కులసంఘాల సభ్యులు 500 మంది ఉన్నారు.

కాళేశ్వరం లింక్-2లో కొనసాగుతున్న ఎత్తిపోతలు

రామడుగు, ఆగస్టు 23 : కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లో గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లి జలాశయం నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్‌హౌస్‌కు జలాలు చేరుతుండగా, శుక్రవారం 5,6 మోటర్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. ఇక్కడ (2,4) మోటర్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి తరలిస్తున్నారు. కాగా, శుక్రవారం సాయంత్రం వరకు ఎల్లంపల్లి నుంచి 18 టీఎంసీల జలాలు మధ్య మానేరుకు తరలించినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మధ్యమానేరు జలాశయంలో 27.54 టీఎంసీల నీటి సామర్థ్యానికి ప్రస్తుతం 17.78 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. కాగా, మధ్యమానేరు నుంచి ఇల్లంతకుంట మండలం అనంతగిరిలోని అన్నపూర్ణ ప్రాజెక్టుకు నీటిని తరలిస్తున్నారు.

వికటించిన టీకా

సౌదీలో జగిత్యాల జిల్లా వాసి యువకుడి నరకయాతన

జగిత్యాల టౌన్, ఆగస్టు 23: హైదరాబాద్‌లోని ఒక గల్ఫ్ మెడికల్ సెంటర్‌లో టీకా వేయించుకొని సౌదీకి వెళ్లిన ఓ యువకుడు టీకా వికటించి అస్వస్థతకు గురై నరకయాతన అనుభవిస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన పోతుగంటి చంద్రశేఖర్ జూన్ 24న హైదరాబాద్‌లోని గల్ఫ్ మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షలతోపాటు టీకా వేయించుకున్నాడు. ఢిల్లీలోని హెచ్‌ఆర్ ఇంటర్నేషనల్ అనే రిక్రూటింగ్ ఏజెన్సీ ద్వారా జాబ్ వీసాపై జూలై 11న సౌదీ అరేబియాలోని ఆల్-బాద్ తాబూక్‌కు వెళ్లాడు. అక్కడ ఫ్యామ్కో కంపెనీ నియోమ్ ప్రాజెక్ట్‌లో క్లీనింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నిరోజుల తర్వాత టీకా తీసుకున్న కుడి భుజానికి ఇన్ఫెక్షన్ అయింది. మెరుగైన చికిత్స కోసం స్వదేశానికి పంపించాలని మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని చంద్రశేఖర్ తల్లి ఆవేదన వ్యక్త చేసింది. తిరిగి స్వదేశానికి అత్యవసరంగా రప్పించడానికి చర్యలు తీసుకోవాలని అతని తల్లి లక్ష్మి గురువారం హైదరాబాద్‌లోని విదేశాంగ శాఖ పీవోఈ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించింది.

రాజన్న ఆలయంలో కొనసాగిన ఏసీబీ తనిఖీలు

వేములవాడ, ఆగస్టు 23: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న సన్నిధిలో ఏసీబీ అధికారుల తనిఖీలు రెండో రోజైన శుక్రవారం కూడా కొనసాగాయి. గురువారం 20 మంది ఏసీబీ అధికారుల బృందం 12 గంటల పాటు తనిఖీ చేయడంతోపాటు రికార్డు చేయగా, రెండోరోజు పది మంది అధికారులు స్వామివారికి సంబంధించిన లీజులు, పలు విభాగాల టెండర్లు, నిత్యాన్నదాన సత్రానికి సంబంధించిన పలు రికార్డులను 4 గంటలపాటు పరిశీలించారు. లడ్డూ ప్రసాదాల తయారీ, విక్రయాలు, గోదాం నిల్వలు, లీజుల టెండర్లు, వసతి గదుల సముదాయాలు, నిత్యాన్నదానం తదితర అంశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసినట్టు తెలిసింది.

విష జ్వరంతో చిన్నారి మృతి

గీసుగొండ, ఆగస్టు 23: విష జ్వరంతో చిన్నారి మృతి చెందిన ఘట న వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని విశ్వనాథపురంలో శుక్రవా రం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దూల మహేందర్-శ్రీలత దంపతుల కుమార్తె నిత్యశ్రీ (9) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నది. 20న నిత్యశ్రీకి జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానిక వైద్యుడిని సంప్రదించి సిరప్ వాడటంతో తగ్గింది. గురువారం చిన్నారికి వాంతులు, విరేచనాలు కావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స అందిస్తుండగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి చనిపోయినట్టు తల్లిదండ్రులు తెలిపారు.

వనపర్తి జిల్లాలో దాహం.. దాహం

- నిలిచిన మిషన్ భగీరథ సరఫరా
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

జగత్‌పల్లి సమీపంలో ఎయిర్‌వాల్వ్ గుంతలోంచి నీటిని తొలగిస్తున్న దృశ్యం

వనపర్తి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : వనపర్తి జిల్లాలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. భగీరథ పైపులైన్‌కు అదనంగా పెద్దమందడి మండలం బుగ్గపల్లితండా వద్ద ప్రత్యేక ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ పథకంలోనే దాదాపు 57 కిలోమీటర్ల ప్రత్యేక లైన్‌కు ఆరుచోట్ల వాల్వ్‌లు ఏర్పాటు చేయలేదు. వేసవిలో చేయాలనుకున్నా నీటిఎద్దడి ఏర్పడుతుందన్న కారణంతో అప్పట్లో అధికారులు విరమించుకున్నారు. ప్రస్తుతం ఈ పనులు చేపట్టడంతో జిల్లాలోని సగభాగానికిపైగా పట్టణాలు, గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీనికితోడు రాజపేట సమీపంలో భగీరథ పైపులైన్ పగలడంతో నీటి సమస్య మరింత తీవ్రమైంది. కొన్ని ప్రాంతాల్లో అధికారులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నా ప్రజలకు సరిపోవడం లేదు. స్థానికంగా అందుబాటులో ఉన్న వ్యవసాయ బోరుమోటర్లను ఆశ్రయిస్తున్నారు. భగీరథ పథకంలో పలు పోస్టులు ఖాళీలు ఉండటంతో పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి మాట్లాడుతూ పైపులైన్లను అనుసరించి కొన్ని వాల్వ్‌లు ఏర్పాటు చేయడం కోసం నీటి సరఫరాను నిలిపివేసినట్టు తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి చేయాలనుకున్నా వర్షాల కారణంగా ఆటంకం ఏర్పడిందని పేర్కొన్నారు.

అన్నలు నా బిడ్డ జీవితాన్ని నాశనం చేశారు

- ఏడేండ్లు సేవ చేయించుకొని హతమార్చారు
- భోరున విలపిస్తున్న రాధ తల్లిదండ్రులు

ఇంటిముందు విలపిస్తున్న రాధ తల్లిదండ్రులు పోచమ్మ, బాలయ్య

కాప్రా, ఆగస్టు 23: 'అమ్మా, నాకు ఉద్యోగం దొరకబోతోంది, త్వరలోనే మన కష్టాలు తీరుతాయి' అందరూ జాగ్రత్తగా ఉండండి అంటూ ఇంటి నుంచి వెళ్లిన పల్లెపాటి రాధ అటు నుంచి అటే అదృశ్యమై పోయిందనీ, ఏడేండ్ల తర్వాత విగతజీవిగా తిరిగి వచ్చిందని మావోయిస్టు రాధ అలియాస్ నీల్సో తల్లిదండ్రులు పల్లెపాటి పోచమ్మ, పల్లెపాటి బాలయ్య భోరున విలపిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పల్లెపాటి బాలయ్య జీవనోపాధి కోసం కుటుంబంతో 35 ఏండ్ల క్రితం కాప్రాలోని ఇందిరానగర్‌కు వచ్చాడు. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె రాధ అలియాస్ నీల్సో డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ (డీఎంఎల్‌టీ)కోర్సు పూర్తి చేసింది. మహిళలను చైతన్యం చేసేందుకు, వరకట్న దురాచారాలను, మద్యం వంటి చెడు అలవాట్లనుంచి కుటుంబాలను దూరం చేసేందుకు ఆమె స్వచ్ఛంద సంస్థలో చేరింది. చక్కటి గొంతు, తెలివితేటలు, సమాజాన్ని చైతన్య పరిచాలనే దృక్పథం నచ్చి ఆమెను స్వచ్ఛంద సంస్థ వారు చేర్చుకున్నారు. ఆ సంస్థవారే తమ బిడ్డను ఉద్యమం బాట పట్టిస్తారని ఊహించలేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. 2017లో 17 ఏండ్ల వయస్సులో రాధ తమను విడిచి వెళ్లిందని, ఎంత వెతికినా దొరకలేదని చెప్పారు. ఆమె మావోయిస్టుల దళంలో చేరినట్టు మూడేండ్ల క్రితం తెలిసిందని అన్నారు. ఈ నెల 19న ఆమె మృతి చెందిందని, భద్రాచలం వద్ద మృతదేహం ఉన్నట్టు సమాచారం వచ్చిందని తెలిపారు. రాధను ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులే చంపారని చెప్పారు. ఆమె ఉద్యమానికి ద్రోహం తలపెట్టే వ్యక్తి అయితే ఏడేండ్లు ఎలా పనిచేస్తుందని ప్రశ్నించారు. దళితురాలు అయినందునే కోవర్టు ఆరోపణతో హతమార్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంతోమంది ఎన్నో ఏండ్లు నక్సల్స్‌గా పనిచేసి ఏదో ఒక దశలో లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారని, తన బిడ్డకు మాత్రం ఆ అవకాశం లేకుండా చేశారని విలపించారు. 'ఏడేండ్లు సేవ చేయించుకున్నారు, నా బిడ్డను ఎలా చంపాలనిపించిందయ్యా మీకు' అని తల్లి పోచమ్మ గొల్లుమంది. పేదరికంలో ఉన్న తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు.

కరెంట్ షాక్‌తో యువ రైతు మృతి

రాజంపేట్, ఆగస్టు 23: పొలంలో విద్యుత్తు షాక్ తగిలి రైతు మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలం అన్నారం తండాలో శుక్రవారం చోటుచేసుకున్నది. తండాకు చెందిన రైతు బానోత్ తిరుపతి(33) తనకున్న రెండెకరాలతోపాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన తిరుపతికి.. పక్కనున్న పొలానికి కరెంట్ సరఫరా కోసం తీసుకున్న వైర్లు ప్రమాదవశాత్తు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

వేతనాల కోసం అంగన్‌వాడీల ధర్నా

కామారెడ్డి, ఆగస్టు 23: వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మినీ అంగన్‌వాడీ నిర్వాహకులు శుక్రవారం కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని కోరారు.

'తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలకు హక్కులు ఉండవు'

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలకు హక్కులు ఉండవని, స్వార్జిత ఆస్తిని తనకు ఇష్టం వచ్చిన వాళ్లకు ఇచ్చే అధికారం తల్లికి ఉంటుందని హైకోర్టు కీలక తీర్పు చెప్పింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో సుశీల్ అగర్వాల్ అనే మహిళకు భర్త నుంచి సంక్రమించిన ఇంటిని ముగ్గురు కుమారులకు సమానంగా పంచకుండా పెద్దకుమారుడి పేరుతో గిఫ్ట్ సెటిల్మెంట్ డీడ్ చేయడాన్ని సివిల్ కోర్టు సమర్థించింది. దీన్ని సవాల్ చేస్తూ భజరంగ్‌లాల్ అగర్వాల్ అనే వ్యక్తి హైకోర్టులో దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని ధర్మాసనం కొట్టివేసింది. ఆ ఆస్తిని ఉమ్మడి కుటుంబ ఆస్తిగా ప్రకటించాలన్న వాదన చట్ట వ్యతిరేకమని తేల్చింది. ఆ ఆస్తి యజమానిగా తల్లికే పూర్తి హక్కులు ఉంటాయని తీర్పు చెప్పింది.

ఆ అధికారం ఐటీడీఏ పీవోలకు లేదు

- సివిల్ సూట్ల విచారణపై హైకోర్టు స్పష్టీకరణ
- పెండింగ్ సూట్లను కలెక్టర్లకు అప్పగించాలని తీర్పు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ఏజెన్సీ ప్రాంతాల్లో సివిల్ సూట్లను విచారించే అధికారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో)కి లేదని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఏజెన్సీ చట్ట నిబంధనల ప్రకారం సివిల్ సూట్లపై విచారణ జరిపే అధికారం జిల్లా కలెక్టర్లకు మాత్రమే ఉన్నదని, ఆ అధికారాన్ని ప్రభుత్వ అదనపు ఏజెంట్లుగా పీవోలకు కట్టబెట్టడం చెల్లదని స్పష్టం చేసింది. 2002లో ఉట్నూరు ఐటీడీఏ పీవోకు సివిల్ సూట్లను విచారించే అధికారాన్ని అప్పగిస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఐటీడీఏ పీవోల వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ సూట్లను కలెక్టర్లకు బదిలీ చేయాలని ఆదేశించింది. ఒక సివిల్ వివాదంలో డాక్యుమెంట్లను పరిశీలించేందుకు చేతిరాత నిపుణులకు పంపాలన్న అభ్యర్థనను తిరస్కరిస్తూ ఉట్నూరు ఐటీడీఏ పీవో ఉత్తర్వులు జారీచేయడంపై హస్సాపూర్ గ్రామానికి చెందిన చవన్ ప్రకాశ్ హైకోర్టును ఆశ్రయించడంతో జస్టిస్ కే శరత్ శుక్రవారం ఈ తీర్పును వెలువరించారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia
దమ రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.
ఇ-టెండరు కోరుతూ ప్రకటన
(http://ireps.gov.in ద్వారా)
దిగువ పనుల కొరకు భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్ డిస